
సాక్షి గుంటూరు

శనివారం, 30, ఆగస్టు, 2025



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,41,566 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా ప్రాజెక్టు దిగువకు 2,42,132 క్యూసెక్కులు వదులుతున్నారు.



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కులు శుక్రవారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.

ఇన్‌చార్జి ప్రభుత్వ న్యాయవాదిగా ఫారూఖ్



గుంటూరు లీగల్: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం లేబర్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ న్యాయవాది (ఏజీపీ)గా ఉన్న షేక్ ఫారూఖ్ ఇన్‌చార్జి ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులయ్యారు.

న్యూస్‌రీల్

ముగిసిన డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఏసీ కళాశాలలో రెండు రోజులపాటు జరిగిన డీఎస్సీ-2025 సెలెక్టెడ్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ శుక్రవారం ముగిసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో భర్తీ చేసేందుకు నిర్ణయించిన 1,143 పోస్టులతోపాటు జోనల్ స్థాయిలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో ఉన్న మోడల్, ఆశ్రమ, సాంఘిక సంక్షేమ పాఠశాలల్లోని 572 పీటీజీ, టీజీటీ, పీడీ, పీఈటీ పోస్టులవారీగా అభ్యర్థులకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన ముగిసింది. గురువారం 930 మందికి సంబంధించి పరిశీలన పూర్తి కాగా, శుక్రవారం జోనల్‌స్థాయి పోస్టులకు ఎంపికైన అభ్యర్థులవి పరిశీలించారు. రెండు రోజుల వ్యవధిలో 1,650 మందికి పైగా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. ఈ ప్రక్రియను ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి, పరిశీలకురాలు పి.శైలజ, డీఈవోలు సీవీ రేణుక, చంద్రకళ, పురుషోత్తంలు పర్యవేక్షించారు.

డీడీగా విధుల్లో చేరిన పాల్ సుధాకర్



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం డెప్యూటీ డైరెక్టర్‌గా బండి పాల్ సుధాకర్ శుక్రవారం విధుల్లో చేరారు. గుంటూరు ఆర్డీగా పనిచేస్తున్న గుర్రం శ్రీనివాసులు రెడ్డి జేడీగా పదోన్నతి పొంది విజయవాడ డీఎంఈ కార్యాలయానికి బదిలీ కావడంతో ప్రభుత్వం పాల్ సుధాకర్‌ను డీడీగా నియమించింది. విధుల్లో చేరిన పాల్ సుధాకర్ ఆర్డీ డాక్టర్ శోభారాణిని కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. డీడీగా విధుల్లో చేరిన పాల్ సుధాకర్‌ను కార్యాలయం సూపరింటెండెంట్లు సత్యం, రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్లు, పలువురు కార్యాలయ ఉద్యోగులు, పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది అభినందించారు.

కూటమిగా దోపిడీకి ఎత్తులు!

- బార్ లైసెన్సుల కోసం దరఖాస్తులు అరకొరే
- గడువులోగా 32 బార్లకే నిబంధన మేరకు దాఖలు
- డిపాజిట్లు, ఫీజులు తగ్గించుకొనే ఎత్తుగడలో సిండికేట్లు
- నేడు కలెక్టరేట్‌లో లాటరీ ప్రక్రియకు సన్నాహాలు

బార్లు దక్కించుకునేందుకు కూటమి నేతల సిండికేట్ కుయుక్తులు గెలిచాయి. మద్యం అమ్మకాలతో పెద్ద ఎత్తున ఆదాయం సమకూర్చుకుంటున్న సర్కార్.. ఇప్పుడు తమవారికి బార్లను తక్కువ మొత్తానికే కట్టబెట్టేలా వ్యవహరిస్తోంది. ఇప్పటికే మద్యం దుకాణాలు దాదాపుగా అన్నీ కూటమి నేతల చేతిలో ఉన్నాయి. బార్ల ఏర్పాటులో ప్రభుత్వ ఖజానాకు గండికొట్టడమే కాకుండా... తమ జేబులు నింపుకొనే పనిలో ఉన్నారు.

బార్‌లకు దరఖాస్తుల విషయంలో కూటమి నేతల సిండికేటు



సాక్షి ప్రతినిధి, గుంటూరు, నెహ్రూనగర్: జిల్లాలో మొత్తం 110 బార్ అండ్ రెస్టారెంట్లకు దరఖాస్తులు ఆహ్వానించారు. శుక్రవారం గడువు ముగిసేనాటికి గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 73గాను 24 బార్లకు మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో 17కుగాను 7 బార్లకు, తెనాలి మున్సిపాలిటీలో 17కుగాను ఒక బార్‌కు, పొన్నూరు మున్సిపాలిటీ పరిధిలో 3 బార్లకు ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాలేదు. మొత్తగా 32 బార్లకు శనివారం లాటరీ ద్వారా కేటాయింపులు చేయనున్నారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఒక్కో బార్‌కు రూ.75 లక్షలు లైసెన్సు ఫీజు, రూ.5 లక్షలు దరఖాస్తు ఫీజు, రూ.10 వేలు ఎన్‌రోల్ ఫీజు కింద కట్టాలని ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. బార్‌కు లాటరీ తీయాలంటే కనీసం 4 దరఖాస్తులు రావాలని నిబంధన పెట్టింది. ఇలా 4 దరఖాస్తులకు రూ.5 లక్షల చొప్పున రూ.20 లక్షలు ప్రభుత్వానికి రానుంది. మిగిలిన ప్రాంతాల్లో రూ.55 లక్షలు లైసెన్స్ ఫీజుగా ఖరారు చేసింది.

మద్యం వ్యాపారులందరూ సిండికేట్?

బార్లలో ఆదాయం పెంచుకునేందుకు ఎత్తుగడ వేసిన కూటమి మద్యం వ్యాపారుల సిండికేట్ బార్లకు దరఖాస్తులు చేసేందుకు ముందుకు రాలేదు. లైసెన్సు ఫీజును మరింతగా తగ్గించుకునేందుకు ఇలా చేస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి ఆగస్టు 18న ప్రభుత్వం జనరల్ కేటగిరీలోని బార్లకు, 20న గీత కార్మికుల బార్ల ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇచ్చింది. 26 తేదీ గడువు ముగిసేనాటికి ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. దీంతో 29 వరకు గడువు పొడిగించారు. 29వ తేదీ రాత్రి తొమ్మిది గంటల సమయానికి 110 బార్లకు 136, గీత కార్మికులకు కేటాయించిన 10 బార్లకు 58 దరఖాస్తులు వచ్చాయి. అయితే ప్రతి బార్‌కు నాలుగు దరఖాస్తులు కచ్చితంగా ఉండాలనే నిబంధన ప్రకారం చూస్తే కేవలం 32 బార్లకు మాత్రమే లాటరీ అవకాశం వచ్చింది. మిగిలిన వాటికి ఒకటి రెండు దరఖాస్తులే వచ్చాయి. మద్యం వ్యాపారులు ఉద్దేశపూర్వకంగానే బార్లకు దరఖాస్తులు వేయడం లేదని తెలుస్తోంది. ఒక్కో బార్‌కు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రూ.75 లక్షలు, మిగిలిన మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్, తెనాలి, పొన్నూరు మున్సిపాలిటీల్లో ఉన్న రూ.55 లక్షల లైసెన్సు ఫీజును తగ్గించుకునేందుకే మద్యం వ్యాపారులు ఇలా చేస్తున్నట్లు సమాచారం. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు దరఖాస్తు సమయం ఉండటంతో వాటి సంఖ్య పెరుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులకు తిప్పలు

బార్ల దరఖాస్తులు, లాటరీ, లైసెన్సుల వ్యవహారాలను సజావుగా పూర్తిచేసే బాధ్యతలను ప్రభుత్వం ఎక్సైజ్ అధికారులపై పెట్టింది. సిండికేట్‌గా మారి లైసెన్సు ఫీజు తగ్గించుకోవాలనుకుంటున్న మద్యం వ్యాపారులు ఉద్దేశపూర్వకంగానే బార్లకు దరఖాస్తులు వేయడం లేదు. అన్ని బార్లకు దరఖాస్తులు వచ్చేలా చూడాలని ఇప్పటికే ఉన్నతాధికారులు అల్టిమేటం జారీ చేశారు. దీంతో జిల్లా ఎక్సైజ్ అధికారులు మాత్రం మద్యం వ్యాపారులను పదే పదే కోరినా స్పందన రాలేదు.

ఎమ్మెల్యేల చేతిలో 'గీత కులాల' దరఖాస్తులు

గుంటూరు జిల్లాలో గీత కులాలకు 10 బార్లు కేటాయించారు. ఇందులో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆరు, మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో రెండు, తెనాలి మున్సిపాలిటీ పరిధిలో రెండు చొప్పున ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో తమ అనుకునే వారే దరఖాస్తు చేసుకునేలా స్థానిక ఎమ్మెల్యేలు పావులు కదిపారు. బయట వ్యక్తులు దరఖాస్తు చేయడానికి ప్రయత్నిస్తే పిలిచి విరమించుకునేలా చేస్తున్నారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉదయం 8 గంటలకు లాటరీ ప్రక్రియ జరగనుంది.

'ధన'నాథుడు...



పల్నాడు జిల్లా నరసరావుపేటలో కాకతీయనగర్‌లోని శ్రీసాయిరామ్ టవర్స్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో గణనాథుడిని శుక్రవారం కరెన్సీ నోట్లతో విశేషంగా అలంకరించారు. దాదాపు రూ.22 లక్షల విలువైన నోట్లతో గణనాథుడు, మండపాన్ని అలంకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. - నరసరావుపేట

రూ. 6.40 లక్షలు పలికిన ఆనంద్‌పేట లడ్డూ



లడ్డూను దక్కించుకున్న ఇగుటూరి రాజశేఖర్‌రెడ్డి



వెనిగండ్లలో లడ్డూతో అబ్బులు యువసేన సభ్యులు

రెంటచింతల: స్థానిక ఆనంద్‌పేట కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద 90 కేజీల లడ్డూను, 30 గ్రాముల వినాయక స్వామి వారి బంగారు లాకెట్‌ను ఇగుటూరి రాజశేఖర్‌రెడ్డి రూ. 6.40 లక్షలకు వేలంపాటలో దక్కించుకున్నారు. సుమారు రెండు గంటల పాటు ఊరేగింపు కొనసాగింది. ప్రధాన రహదారిపై ఆనంద్‌పేట యువత కేరింతలు పెట్టారు. వందల మంది భక్తులు తరలివచ్చారు. గత ఏడాది లడ్డూను గొంటు ఆదిరెడ్డి రూ. 7.10 లక్షలకు దక్కించుకున్నారు.

వెనిగండ్లలో రూ. మూడు లక్షలకు పైగా ..

పెదకాకాని: మండలంలోని వెనిగండ్ల గ్రామంలో గురువారం రాత్రి వినాయక లడ్డూ వేలం నిర్వహించారు. వేమారెడ్డి గుడి సెంటర్‌లో రెడ్డి యూత్ ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి బుర్రముక్కల శ్రీనివాసరెడ్డి 25 కిలోల లడ్డూ, తియ్యగూర శ్రీ ప్రియాంక రెడ్డి 20 కిలోల లడ్డూ, పులగం వేమారెడ్డి 11 కిలోల లడ్డూ సమర్పించారు. వేలంలో అబ్బులు(ఆత్మకూరి శేషిరెడ్డి) యువసేన 25 కిలోల లడ్డూను రూ.3,01,116లకు దక్కించుకుంది. 20 కిలోల లడ్డూ రూ.40 వేలకు, 11 కిలోల లడ్డూ రూ.40 వేలకు భక్తులు దక్కించుకున్నారు. అనంతరం వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు.

ఏషియన్ షూటింగ్ పోటీల్లో ముఖేష్‌కు పతకాల పంట



గుంటూరు వెస్ట్ (క్రీడలు): కజకిస్తాన్‌లోని షెమ్కెంట్‌లో జరుగుతున్న ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరుకు చెందిన షూటర్ నేలవల్లి ముఖేష్ పతకాల పంట పండించాడు. శుక్రవారం జరిగిన ఫైనల్లో 50 మీటర్ల ఫ్రీ పిస్టల్, 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ , 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ టీమ్ విభాగాల్లో 3 బంగారు పతకాలు, 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించాడు. భారత్ జూనియర్ జట్టులో సభ్యుడైన ముఖేష్ కొన్ని సంవత్సరాలుగా జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో నిలకడగా రాణిస్తున్నాడు. రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి వ్యక్తిగా అరుదైన రికార్డును సైతం నెలకొల్పాడు. ఈ సందర్భంగా ముఖేష్‌ను రైఫిల్ అసోసియేషన్ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు సలలిత్, రాజ్ కుమార్‌తోపాటు కేఎల్ యూనివర్సిటీ స్పోర్ట్స్ డీన్ హరికిషోర్‌లు అభినందించారు.

తెలుగులో న్యాయమూర్తి తీర్పులు



న్యాయమూర్తి పవన్‌కుమార్

తెనాలి రూరల్: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెనాలిలో న్యాయమూర్తి శుక్రవారం తెలుగులో తీర్పులు చెప్పారు. తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఏకా పవన్‌కుమార్ ఐదు కేసులకు సంబంధించిన తీర్పులను తెలుగులో వెల్లడించారు. ప్రామిసరీ నోట్లకు సంబంధించి నాలుగు, మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో తీర్పులను ఈ మేరకు వెలువరించారు. గతేడాది కూడా పలు కేసులకు ఇదే తరహాలో తీర్పు చెప్పారు.

శాంతించిన కృష్ణమ్మ

కొల్లూరు: కృష్ణమ్మ శాంతించింది. నదీ తీర గ్రామాల వాసులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి గురువారం సముద్రంలోకి విడుదల చేస్తున్న వరద నీటి పరిమాణం పెరగడంతో నదిలో నీటిమట్టం అర్ధరాత్రి నుంచి క్రమక్రమంగా పెరిగి లోతట్టు ప్రాంతాలలోకి వరద నీరు చేరింది. 4.38 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేసిన కారణంగా మండలంలోని పోతార్లంక, గాజుల్లంక, చింతర్లంక గ్రామాల పరిధిలో సాగు చేసిన వాణిజ్య పంటలు వరద ముంపునకు గురయ్యాయి. మండలంలోని దోనేపూడి -పోతార్లంక గ్రామాల నడుమ ఉన్న లోలెవల్ వంతెనపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజ్‌కు వరద నీటి విడుదల తగ్గుతుండటంతో నీటిపారుదల శాకాధికారులు దిగువకు నీటి విడుదలను గణనీయంగా తగ్గించి శక్రవారం సాయంత్రానికి 2.96 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. బ్యారేజ్ నుంచి నీటి విడుదల తగ్గుముఖం పట్టడంతో మొదటి విడత ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. నదిలో నీటిమట్టం తగ్గుముఖం పట్టడంతో నదీ పరివాహక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కొల్లూరు మండలం గాజుల్లంక -పోతార్లంక మధ్య కంద పంటలోకి చేరిన వరద నీరు

దొంగల దెబ్బకు గుండెల్లో రైళ్లు

- గుంటూరు డివిజన్ పరిధిలో నడికుడి రైల్వేస్టేషన్ పరిసరాల్లో దోపిడీలు
- ఇటీవల వరుసగా మూడుసార్లు రైలు ఆపి బంగారం దోచుకెళ్లిన దొంగలు
- సిగ్నల్ ట్యాంపరింగ్ ద్వారా తెగబడుతున్న చోరులు
- రైల్వే అధికారుల నిర్లక్ష్యంతో ప్రయాణికుల్లో ఆందోళన
- అదనపు భద్రతా సిబ్బందిని ఈ మార్గంలో నియమించడంలో విఫలం
- ప్రత్యేక చర్యలు తీసుకుంటేనే నేరాలకు అడ్డుకట్ట సాధ్యం
- తాజాగా తాడేపల్లి - మంగళగిరి మధ్య రెండు రైళ్లలో మళ్లీ దోపిడీ

రైల్వే ప్రయాణికులకు భద్రత గాలిలో దీపంలా మారింది. రైల్వే, పోలీస్ శాఖకు దోపిడీదారులు, చోరులు సవాల్‌గా మారారు. రైల్వే శాఖలో సిబ్బంది కొరత ఉండటంతో నేరాలను అడ్డుకునేందుకు కనీస చర్యలు కూడా చేపట్టడం లేదు. సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి ఇటీవల కాలంలో మూడు సార్లు ప్రయాణికులను దొంగలు దోచుకున్నారు. తాజాగా ఒకే రోజు రెండు రైళ్లల్లో దొంగతనాలు జరిగాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు.



సాక్షి ప్రతినిధి, గుంటూరు : గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని వాస్కోడిగామా-షాలీమార్ రైలులో అచ్యుతాంబ అనే ప్రయాణికురాలు బళ్ళారి నుంచి రాజమండ్రి వెళుతున్న సమయంలో ఆమె మెడలో ఉన్న 16 గ్రాముల బంగారు ఆభరణాన్ని దొంగ లాక్కెళ్లాడు. మంగళగిరి-కేసీపీ సిమెంట్స్ వద్ద రైలు మలుపు తిరిగే ప్రదేశంలో దోచుకుని పారిపోయాడు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. అలాగే భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ రైలు మంగళగిరి- కేసీపీ సిమెంట్స్ వద్ద మలుపు తిరిగే సమయంలో లలితా బెహరా అనే ప్రయాణికురాలి బ్యాగ్‌ను కూడా దొంగ లాక్కెళ్లాడు. ఈ ఘటన కూడా శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. బ్యాగ్‌లో 25 గ్రాముల బంగారు వస్తువులు ఉన్నట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారు. రైల్వే జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఒకే ప్రదేశంలో రెండు వేరు వేరు రైళ్లలో దొంగతనాలు చేసిన వ్యక్తి ఒక్కరే కావచ్చని అనుమానిస్తున్నారు. మంగళగిరి రైల్వే స్టేషన్ పరిధిలో దొంగతనానికి పాల్పడే యత్నం చేస్తున్న విషయాన్ని గమనించిన రైల్వే పోలీసులు అప్రమత్తం కావడంతో చోరీ చేసే వ్యక్తి పరారీ అయ్యాడు.

గతంలోనూ పలు ఘటనలు

15 రోజుల క్రితం ఇదే తరహాలో దొంగతనాలు జరిగాయి. తాడేపల్లి, మంగళగిరి మధ్య దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఏడాది జూన్ 29న నాగర్‌సోల్-నరసాపూర్ రైలులో తుమ్మలచెరువు వద్ద దోపిడీకి పాల్పడిన వారిపై రైల్వే పోలీసులు కాల్పులు జరపడంతో పరారయ్యారు. ఈ ఏడాది జూన్ 27న న్యూ పిడుగురాళ్ళ, జూన్ 23న తుమ్మల చెరువు, ఈ నెల 25న నడికుడి స్టేషన్‌ల వద్ద సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి మరీ బంగారం, ఇతర విలువైన వస్తువులను దొంగలు దోచుకెళ్లారు మహారాష్ట్ర, బిహార్ ముఠాలు ఈ దోపిడీలకు పాల్పడుతున్నట్లు సమాచారం.

వేధిస్తున్న సిబ్బంది కొరత

రాత్రి పూట ప్రయాణించే రైళ్లలో కనీసం నలుగురు సాయుధ పోలీసులు ఉండాలి. కానీ, ఒకరిద్దరితో అధికారులు సరిపెడుతున్నారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ, ఐఆర్పీ పోలీసుల పరిధిలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలు ఉన్నాయి. వీటి పరిధిలో నాలుగు రైల్వే పోలీస్ స్టేషన్‌లు గుంటూరు, తెనాలి, నడికుడి, నరసరావుపేట స్టేషన్‌లు ఉన్నాయి. వీటికిగాను గుంటూరు, తెనాలి, నడికుడి రైల్వే పోలీస్ స్టేషన్‌లకు ఎస్సైలు ఉండగా, నరసరావుపేట స్టేషన్‌కు ఎస్సై పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉంది. అయితే గుంటూరు రైల్వే డివిజన్‌లోని జీఆర్పీ పరిధిలో ఉండాల్సిన సిబ్బందిలో 20 శాతం, ఆర్పీఎఫ్ పరిధిలో 30 శాతం సిబ్బంది మాత్రమే ఉన్నారు. గుంటూరు డివిజన్ నుంచి సుమారు 70 రైళ్లు రాకపోకలు సాగిస్తున్న క్రమంలో వాటిలో భద్రత కల్పించేందుకు సరైన సిబ్బంది లేని దుస్థితి నెలకొంది.

అరకొరగా పనిచేస్తున్న సీసీ కెమెరాలు

కేంద్ర ప్రభుత్వం ఒక వైపు రైల్వే స్టేషన్లలో అత్యాధునిక సదుపాయాలను కల్పిస్తున్నామని చెబుతున్నప్పటికీ కనీసం రైల్వే ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయడం లేదు. ప్రధానంగా గుంటూరు రైల్వే స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అరకొరగా మాత్రమే పనిచేస్తున్నాయి. మరీ ముఖ్యంగా నడికుడి, నరసరావుపేట, కృష్ణా కెనాల్, తాడేపల్లి, మంగళగిరి, నంబూరు, బాపట్ల, రేపల్లె, వంటి రైల్వే స్టేషన్‌లలో సీసీ కెమెరాలు లేకపోవడంతో ఆయా ప్రాంతాలలో దొంగతనాలు చేసేందుకు దొంగలకు సులువుగా ఉంది.

కాల్పులకూ వెనుకాడం

రైల్వే ప్రయాణికుల భద్రత కోసం దొంగలపై తుపాకీ కాల్పులు జరపడానికి కూడా మా సిబ్బంది వెనుకాడటం లేదు. నడికుడి రైల్వే స్టేషన్‌లో అలారం చైన్ పుల్లింగ్ (ఏసీపీ) జరిగిన తక్షణమే పక్క బోగీలో ఉన్న రైల్వే పోలీసులు అప్రమత్తం అయ్యారు. దొంగలను పట్టుకునేందుకు వారిపై కాల్పులు కూడా జరిపారు. తర్వాత రెండు నెలలపాటు నేరాలు కొంత మేర తగ్గాయి. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఉన్న వారితోనే నేరగాళ్లపై పూర్తి నిఘా పెడుతున్నాం. ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నాం.

– పి.అక్కేశ్వరరావు, జీఆర్పీ డీఎస్పీ, గుంటూరు రైల్వే డివిజన్

వైఎస్సార్ సీపీలో పదవుల నియామకం



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా షేక్ ఖాసీంబేగ్, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా కొల్లూరు శివప్రసాద్‌రావు, సోషల్‌మీడియా విభాగం అధ్యక్షుడిగా రమేష్‌సాహు, ఐటీ విభాగం అధ్యక్షుడిగా యేరువ ఇన్నారెడ్డిలను నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

యువజన విభాగం నగర అధ్యక్షుడిగా కోటేశ్వరరావు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ యువజన విభాగం గుంటూరు నగర అధ్యక్షుడిగా పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఏటీ కోటేశ్వరావును నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న సయ్యద్ జియావుద్దీన్

గుంటూరు లీగల్: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు అసంఘటిత రంగ కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ జియావుద్దీన్ మాట్లాడుతూ.. అసంఘటిత రంగంలోని కార్మికులందరూ ఈ– శ్రమ కార్డును కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్డు వలన అత్యవసర సమయంలో వైద్య, ప్రభుత్వ పథకాలకు అర్హులుగా గుర్తించబడి సహాయం పొందుతారని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకొని, పొందవచ్చని వెల్లడించారు. న్యాయపరమైన సూచనలు చేశారు. తాపీ మేస్త్రీలు, పెయింటర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, ఆటో డ్రైవర్లు, మెకానిక్‌లు, వీధి వ్యాపారులు కార్డుకు అర్హులన్నారు. కార్యక్రమంలో కట్ట కాళిదాసు ప్యానల్ అడ్వకేట్‌లు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ హనుమత్ సాయి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి అవసరం

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

గుంటూరు వెస్ట్: యువతతోపాటు దేశాన్ని నిర్వీర్యం చేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి మాదకద్రవ్యాల సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. బాధితులకు వెంటనే డీ అడిక్షన్ సెంటర్‌ల ద్వారా కౌన్సెలింగ్, చికిత్స అందించాలని సూచించారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి, జిల్లా జైలులోనూ డీ అడిక్షన్ సెంటర్ల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థల సహాయం తీసుకోవాలన్నారు. విక్రేతలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. శివారు ప్రాంతాల్లోని శిథిల భవనాలు కూల్చివేయాలని ఆదేశించారు. ఎవరైనా విక్రేతల సమాచారం తెలిస్తే 1972 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేయాలని కోరారు. దీనికి సంబంధించిన ప్రచార బోర్డులను విద్యా సంస్థలతోపాటు అన్ని ప్రధాన కూడళ్లలో కూడా ప్రదర్శించాలన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలతో అనర్థాలపై పూర్తి అవగాహన కల్పించేలా వారధి, పల్లె నిద్ర, ఆపరేషన్ నషా ముక్త్ భారత్, సేఫ్ క్యాంపస్ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో గత నెలరోజులుగా ఎనిమిది ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు అయ్యాయని, 53 మందిని అరెస్టు చేశామని తెలిపారు. ఈ నిందితులకు రౌడీషీటర్ల తరహా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో డీఆర్వో షేక్ ఖాజావలి, డీఎంహెచ్‌వో డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, ఇంటర్మీడియట్ ఆర్‌ఐఓ సునీత, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, సోషల్ వెల్ఫేర్ డీడీ చెన్నయ్య, అధికారులు పాల్గొన్నారు.

గ్రీన్ గ్రేస్‌లో ఘనంగా భాషా దినోత్సవం


గిడుగు చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న అంబటి మురళీకృష్ణ తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): గిడుగు రామ్మూర్తి జయంతి, తెలుగు భాషా దినోత్సవాలను పట్టాభిపురంలోని భజరంగ్ అర్బన్ ఇన్ఫ్రా లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలోని గ్రీన్ గ్రేస్ ప్రాజెక్టు ఆవరణలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భజరంగ్ అర్బన్ ఇన్ఫ్రా లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ పండితులకు పరిమితమైన గ్రాంధిక భాష స్థానంలో సామాన్యులకు సైతం వ్యవహారంలోకి తీసుకొచ్చి తెలుగు భాషను అభివృద్ధి చేసిన ఘనుడిగా గిడుగు రామ్మూర్తి పేరు గడించారని పేర్కొన్నారు. రామ్మూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించడం అభినందనీయన్నారు. ఆయన చేసిన కృషితో ఆధునిక భాష పండితుల నుంచి పామరుల వరకు విస్తృత ప్రచారంలోకి వచ్చిందని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు పాఠ్యపుస్తకాలు, బోధన, చదువు వాడుక భాషలో ఉండటం వల్ల ఆత్మ విశ్వాసంతో చదువులు సాగించి ఎందరో సామాన్యులు అత్యున్నత పదవులు, దేశ విదేశాల్లో గౌరవాలు సాధించారన్నారు. తదనంతరం రామ్మూర్తికి లభించిన బిరుదులు, వారి సేవలను గుర్తించిన పలువురు ప్రముఖుల మాటలను గుర్తు చేశారు. కార్యక్రమంలో భజరంగ్ అర్బన్ ఇన్ఫ్రా లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్లు సిద్ధినేని శ్రీనివాసరావు, సమీర్ నందన్, ప్రాజెక్టు మేనేజర్ దుర్గై, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓకు ఘన సన్మానం


డాక్టర్ కొర్రా విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఏఎన్‌ఎంలు, ఏపీఎన్జీవో నేతలు

గుంటూరు మెడికల్: కష్టపడి పనిచేసే వారికి పదోన్నతులు కల్పించటం, వారి సమస్యలను పరిష్కరించటం తమ కర్తవ్యమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. సచివాలయ ఏఎన్‌ఎంలకు పదోన్నతులు కల్పించిన విజయలక్ష్మి, ఈ ప్రక్రియను వేగవంతం చేయడంలో సహకరించిన ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావులకు సంబంధిత ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. సచివాలయ ఏఎన్‌ఎంల తరఫున ఉమ్మడి గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర ఉపాధ్యక్షులకు ఆత్మీయ అభినందన సన్మాన సభ శుక్రవారం స్థానిక ఎన్జీవో రిక్రియేషన్ హాల్‌లో జరిగింది. సన్మాన సభకు జిల్లా ఏపీఎన్జీవో అధ్యక్షుడు, జిల్లా జేఏసీ చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం విజయలక్ష్మిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, ఉమెన్ వింగ్ జిల్లా ఉపాధ్యక్షురాలు వాణి, సంయుక్త కార్యదర్శి విజయలక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యులు సుకుమార్, వెంకట్ రెడ్డి, జానీబాషా, కృష్ణ కిషోర్, విజయ్, సిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌పీఎస్ సూరి, సీహెచ్ కళ్యాణ్ కుమార్, అమరావతి అధ్యక్షుడు నాగేశ్వరరావు, సత్తెనపల్లి అధ్యక్షుడు మణిరావు, బాపట్ల అధ్యక్షుడు నాగేశ్వరరావు, మంగళగిరి అధ్యక్షుడు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ దూరవిద్య పీజీ కోర్సులకు నోటిఫికేషన్

అక్టోబర్ 10 వరకు దరఖాస్తుల స్వీకరణ



పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (సీడీఈ) పీజీ దూర విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి సెమిస్టర్ విధానంలో యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ), డెబ్ (డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో) నుంచి 23 పీజీ కోర్సులకు అనుమతి లభించిందన్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువు అక్టోబర్ 10వ తేదీతో ముగుస్తుందన్నారు. కోర్సుల కాల వ్యవధి, విద్యార్హతలు, ఫీజులు తదితర వివరాలను ఏఎన్‌యూసీడీఈ. ఇన్ఫో అనే వెబ్ సైట్‌లో గానీ, 0863 – 2346222, 98484 77441 ఫోను నెంబర్లను సంప్రదించడం ద్వారాగానీ తెలుసుకోవచ్చు.

ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలు కూడా...

ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు కూడా షెడ్యూల్ విడుదలైంది. దీని ద్వారా రెండేళ్ల కాలపరిమితితో కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ వివరాలను దూర విద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు వెల్లడించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


పీఎఫ్ రీజనల్ కమిషనర్ ప్రభుదత్తా పుష్టికి వినతి పత్రం అందజేస్తున్న పెన్షనర్స్ కమిటీ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్ : ఆలిండియా పెన్షనర్స్ కో–ఆర్డినేషన్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం గుంటూరు కృష్ణనగర్ లోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయం వద్ద పెన్షనర్స్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ గుంటూరు జిల్లా రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. శేషగిరిరావు మాట్లాడుతూ కనీస పెన్షన్ రూ. 9వేలు ఇచ్చి, డీఏ జతపరచాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ ద్వారా వైద్య సదుపాయం కల్పించి, హయ్యర్ పెన్షన్ కోసం హయ్యర్ వేజెస్ దరఖాస్తులను పరిష్కరించాలని కోరారు. రైల్వేలో రాయితీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఏపీ ఆర్‌పీఏ గుంటూరు జిల్లా కార్యదర్శి కే.బాబు ప్రసాద్ మాట్లాడుతూ 1995లో ప్రారంభించిన ఈ పీ ఎఫ్ పెన్షన్ ఇప్పటికీ సవరించలేదన్నారు. అనంతరం పీఎఫ్ రీజనల్ కమిషనర్ ప్రభుదత్తా పుష్టిని కలిసి వినతి పత్రం అందజేశారు. సభలో ఎన్ఏ శాస్త్రి రాష్ట్ర ఏపీఆర్పీఏ అధ్యక్షుడు కే. గంగాధరరావు, ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ సభ్యులతో పాటు పోరాటానికి మద్దతు తెలియజేసేందుకు సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు అధ్యక్షుడు రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి నరసయ్య , బ్యాంక్ ఎంప్లాయిస్ నాయకులు వి. సాంబశివరావు , జూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఏ నికల్స్ , ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ జిల్లా కార్యదర్శి బి. నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడిని హత్య చేసిన నిందితుడి అరెస్ట్


మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్

నగరంపాలెం: తమ్ముడిని హత్య చేసిన నిందితుడిని పాతగుంటూరు పోలీసులు అరెస్ట్ చేసినట్లు తూర్పు సబ్ డివిజనల్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపారు. శుక్రవారం పాతగుంటూరు పోలీస్‌స్టేషన్ (పీఎస్)లో సీఐ వెంకట ప్రసాద్‌తో కలసి డీఎస్పీ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ... ఎన్టీఆర్‌నగర్ ఒకటో వీధిలో ఉంటున్న కంచర్ల రమేష్, రామిరెడ్డితోట మూడో వీధికి చెందిన సురేష్ (30) సొదరులని తెలిపారు. ఆటోడ్రైవర్‌గా జీవనం సాగించే సురేష్‌కు సుమారు పదేళ్ల క్రితం మీరాబీతో ప్రేమ పెళ్లైందని అన్నారు. కొన్నాళ్లుగా అన్న, తమ్ముడి మధ్య నగదు పంపిణీ విషయమై గొడవలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ నెల 22వ తేదీన రాత్రి మణిపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపాన ఇద్దరి మధ్య వివాదం నెలకొందని, ఈ క్రమంలో తమ్ముడిపై అన్న రమేష్ పెట్రోలు పోసి నిప్పంటించాడని తెలిపారు. అతడిని జీజీహెచ్‌లో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. మృతుడి భార్య ఫిర్యాదుతో పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేయగా, శుక్రవారం రమేష్‌ను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

91 మందికి ఉద్యోగ కల్పన


పత్రాలు అందజేస్తున్న సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్

తాడికొండ: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి – శిక్షణ శాఖ సౌజన్యంతో తుళ్లూరులోని సీఆర్‌డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాను పలువురు సద్వినియోగం చేసుకున్నారు. 300కి పైగా ఉద్యోగాలను భర్తీ చేసేందుకు జాబ్ మేళా నిర్వహించగా 301 మంది హాజరయ్యారు. వీరిలో 91 మందికి ఉద్యోగాలు లభించాయని సీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన పలువురు అభ్యర్థులకు ఆయా కంపెనీల హెచ్‌ఆర్ విభాగ ప్రతినిధులతో కలసి సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఆఫర్ లెటర్లు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ అధికారి అరుణ కుమారి, సీఆర్‌డీఏ డీసీడీవోఓ బి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

కాపాడిన మత్స్యకారులు


మహిళను బయటకు తీసుకువస్తున్న మత్స్యకారుడు

తాడేపల్లి రూరల్: ప్రకాశం బ్యారేజ్ కృష్ణానది దిగువ ప్రాంతంలోని సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద ఓ మహిళ కృష్ణానది వరద నీటిలోకి దిగి శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేసింది. ఇది గమనించిన మత్స్యకారులు ఆమెను కాపాడి తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సేకరించిన వివరాల ప్రకారం.. విజయవాడ భవానీపురంనకు చెందిన నరేంద్రతో ఏడాదిన్నర క్రితం యామినికి వివాహమైంది. గత ఆరు నెలలుగా వారి మధ్య మనస్పర్థలు రావడంతో యామిని భవానీపురంలోని తల్లిదండ్రులు వద్ద ఉంటోంది. భర్త దగ్గరకు వెళ్లగా ఇంట్లో నుంచి బయటకు నెట్టడంతో మనస్తాపం చెంది సీతానగరం పుష్కర ఘాట్ల వద్దకు వచ్చింది. చనిపోవడానికి వరదనీటిలోకి దూకింది. పక్కనే పడవలను భద్రపరుస్తున్న మత్స్యకారులు గమనించి నీటిలోకి దిగి ఆమెను కాపాడారు. సమాచారం అందుకున్న తాడేపల్లి మహిళా పీఎస్ఐ అపర్ణ సంఘటనా స్థలానికి వెళ్లి యామిని తండ్రి శ్రీనివాసరావును పిలిపించారు. ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

కారు ఢీకొని సైకిలిస్ట్ మృతి



భట్టిప్రోలు: అతి వేగంగా వస్తున్న కారు ఢీ కొట్టడంతో సైకిలిస్ట్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం భట్టిప్రోలు వద్ద జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లికి చెందిన రంగిశెట్టి జయచంద్రరావు (55) వేమవరం సమీపంలోని ఎన్‌హెచ్ 216/ఎ జాతీయ రహదారి వెంబడి ఉన్న పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. పొలంలో శుక్రవారం నాట్లు వేస్తున్నారు. కూలీలకు తాగు నీరు తీసుకువచ్చేందుకు ఉదయం 10 గంటల సమయంలో సైకిల్‌పై బయలుదేరాడు. వెనుక నుంచి కారు అతి వేగంగా వచ్చిన కారు సైకిల్‌పై వెళుతున్న జయచంద్రరావును ఢీ కొట్టింది. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, చుట్టుపక్కల వారు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. అక్కడికి చేరుకున్న ఎస్ఐ ఎం. శివయ్య ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తామని తెలపడంతో ఆందోళన విరమించారు. గుంటూరుకు చెందిన కారు డ్రైవర్ నక్కా సురేంద్రను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రెండు టన్నుల శివ లింగాకారంలో ప్రసాదం



తెనాలిరూరల్: వినాయక చవితి వేడుకల్లో భాగంగా భక్తులు తెనాలిలో శివ లింగాకారంలో ప్రసాదం తయారు చేయించారు. విశాఖపట్నం గాజువాకలోని లంకా గ్రౌండ్స్‌లో లక్ష చీరలతో ఏర్పాటు చేసిన 90 అడుగుల శ్రీ సుదర వస్త్ర మహా గణపతి కమిటీ సభ్యులు తెనాలిలోని మిర్చి స్నాక్స్‌లో భారీ లడ్డూ ప్రసాదం చేయించాలని నిర్ణయించారు. ఇందుకు మిర్చి స్నాక్స్ నిర్వాహకుడు వి. కిషోర్ అంగీకరించి రెండు టన్నుల శివలింగాకార లడ్డూ ప్రసాదాన్ని తయారు చేసి ఇచ్చారు. ఈ ప్రసాదాన్ని శుక్రవారం రాత్రి ఇక్కడ నుంచి గాజువాకకు తరలించారు.

సీఆర్‌డీఏ పరిధిలో విద్యార్థులకు ఫీజులో రాయితీలు కల్పించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.బాబురావు డిమాండ్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : రాజధానిలో ఉన్న ప్రైవేటు యూనివర్శిటీలలో సీఆర్‌డీఏ పరిధిలోని విద్యార్థులకు ఫీజులు, ఇతర సౌకర్యాలలో రాయితీ కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ బాబురావు డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ల్యాండ్‌పూలింగ్ చట్టం ప్రకారం ఉచిత విద్య, వైద్యం అందించాలని, ప్రభుత్వం ద్వారా రాయితీ వల్ల భూములు పొందిన విద్యాసంస్థలలో ప్రభుత్వ నిబంధనలు పాటించని వాటికి మళ్ళీ భూములు కేటాయించడం సరికాదన్నారు. అలాగే క్యాపిటల్ రీజియన్ పరిధిలో ఉన్న 56 మండలాలలోని విద్యార్థులకు కూడా ఫీజులలో, ఇతర సౌకర్యాలలో రాయితీలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు, కె.నళినీకాంత్, ఎస్.భావన్నారాయణ, ఈమని అప్పారావు, ఎమ్.రవి పాల్గొన్నారు.

గొర్రెలను ఢీ కొన్న లారీ

మేదరమెట్ల: లారీ డ్రైవర్ మద్యం మత్తులో మందపైకి నడపడంతో రెండు గొర్రెలు మృతి చెందగా మరో పది గొర్రెలకు కాళ్లు విరిగినట్లు బాధితుడు తెలిపాడు. హైదరాబాద్ నుంచి చెన్నైకు వెళుతున్న లారీ డ్రైవర్ మద్యం మత్తులో రోడ్డు మార్జిన్‌లో వెళుతున్న గొర్రెల మందపైకి నడిపాడు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల పోలీసు స్టేషన్ సమీపంలో ఈ ప్రమాదం శుక్రవారం చోటు చేసుకుంది. రూ.2.50 లక్షల వరకు నష్టం వాటిల్లింది.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,000** గరిష్ఠం : రూ. **3,000**

మోడల్ ధర రూ. **2,600**



పసుపు ధరలు

(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : **72**

కొమ్ములు : 51 బస్తాలు (ధర రూ॥ల్లో)		
కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
8,500	9,050	9,050

కాయలు : 21 బస్తాలు		
కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
8,500	10,325	10,325

మొత్తం అమ్మకాలు : **54.00** క్వింటాళ్లు

–దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	36,246
అమ్మకాలు	41,057
నిల్వ	5,504

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)	
334	10,000–14,200
నంబరు–5	10,000–13,500
341	10,000–15,200

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)	
334	10,000–14,000
నంబరు–5	10,000–13,600
341	11,000–15,500
4884	10,000–13,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)	
షార్క్–1	10,000 – 15,200
సంగీ బాడిగ 5531	10,000 – 14,600
ఆర్మూర్	9,800 – 12,200
తాలుకాయలు	6,200 – 7,600

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)	
షార్క్–1	10,000 – 15,300
సంగీ బాడిగ 5531	10,000 – 14,000
తాలు	5,400 – 7,300

–కొరిటెపాడు (గుంటూరు)

ఏఎన్‌యూ డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



పెదకాకాని (ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో జూన్, జూలై నెలల్లో నిర్వహించిన డిగ్రీ 5, 6వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు శుక్రవారం విడుదల చేశారు. 5,454 మంది పరీక్షలు రాయగా 4,292 మంది ఉత్తీర్ణత సాధించారు. రీ వాల్యుయేషన్‌కు సెప్టెంబరు 12లోగా ఒక్కో పేపర్‌కు రూ.1,490 చెల్లించాలని ఏసీఈ వెంకటేశ్వరరావు తెలిపారు. రెక్టార్ ఆచార్య కె రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు, ఎ.రాధాకృష్ణ, డాక్టర్ జ్ఞానేశ్వర్‌రెడ్డి, సీఈ శివప్రసాదరావు, నోడల్ ఆఫీసర్ రెడ్డి ప్రకాశరావు, ఏఆర్‌బీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.